వాడికి బండకొయ్య వేయించాడు కూడా.

ఈ చర్యతో రాముడి నవనాడులూ తెగిపోయినట్లయింది. ఎక్కడకు వెళ్ళాలన్నా ఈ బండకొయ్య బుజాన పెట్టుకుని వెళ్ళాలి. తన్ను పశుప్రాయుణ్ణి చేశారు. కాదు, పశువుకన్నా హీనంగా చేసివేశాడు.

రాముడికి తగిలించిన బండకొయ్యచూసి మామయ్య కూతురు సరోజ మనసు కరిగిపోయింది.

“బావా, ఇక్కడకు ఎందుకు వచ్చావు బావ! చక్కగా చదువుకున్నట్లయితే, ఇదంతా ఉండేదికాదుగదా!” అంటూ బండకొయ్యను తొలగించడానికి ఓమారు ప్రయత్నించింది. కాని తండ్రి ఉగ్రుడై, మండిపడి కూతురు మీద కూడా చెయ్యి చేసుకోబోయ్యాడు, ఇకవాడి చాయలకు వెళ్ళకూడదని కట్టడి చేశాడు.

రాముడికి పద్నాలుగోయేడు పైబడుతున్నాది. వాడికి మెల్ల మెల్లగా అనేకభావాలు కలుగుతున్నాయి. “తన్ను అందరూ ఇలా ఈసడించుకోవడం ఎందుకు? 'చదువురాని మొద్దు' అని చివరకు మామయ్యకూతురు కూడా అనుకోవడం దేనికి?—నిజంగా తన జీవితం ఎలా నేడిపోయింది! తను కూడా అందరిలా చదువుకుని, పెద్ద ఉద్యోగం...” ఏవేవో ఆలోచనలు లోనయ్యాడు. తన నడవడిని మార్చుకుని, చదువుకోవాలని వృద్ధిలోకి రావాలనుకున్నాడు.

ఓనాడు [illegible] “మావయ్యా, ఇహనుంచి నేను ఎక్కడకూ వెళ్ళను. చక్కగా చదువుకుంటాను మావయ్యా....” అమాయకంగా అన్నాడు.

“దొంగ వెధవ! వేషాలు కూడా వేస్తావా? మళ్ళీ ఎక్కడికి లేచిపోవడానికి ఈ తంతు!” అంటూ అనుమానించాడు. అయినా వాడు ప్రాధేయపడినమీదట ఎందుకో సమాధానపడ్డాడు.

ఓనాడు రాముడికి ఓ బండ లెక్క ఇచ్చి, అది చేసేదాకా, అన్నం పెట్టవద్దని శాసించాడు. వాడికి ఆ లెక్క ఎలాచెయ్యాలో నమూనా పద్ధతి కూడా ఇదివరకు చెప్పాడు కాదు. పైగా లెక్కలోని మామిడికాయలూ, జామికాయల ప్రస్తావన చూసేసరికి అసలే ఆకలితో ఉన్నవాడికి మరీ ఆకలి పుట్టుకవచ్చింది. నోటిలో తడి ఆరిపోతోంది. ఇక ఆగలేక, చాటుగా వెళ్ళి సరోజను అర్థించాడు ఏమైనా పెట్టమని. ఆ పిల్ల మనసు కరిగిపోయి ఇంట్లో ఉప్పుండలు రెండు తీసుకవచ్చి ఇచ్చింది.

అవి తీరా తిన్నాడో లేదో చండ ప్రచండుడిలా వచ్చిపడ్డాడు మావయ్య. రాముడికి భయంతో నోట్లో లడ్డు వెనక్కూపోలేదు, ముందుకూ పోలేదు.


“ఒరేయ్ అడ్డ గాడిద వెధవా! లెక్క చెయ్యమంటే, లడ్డు తింటూ కూర్చున్నావా! పైగా మా పిల్లకు దొంగతనంగా లడ్డు తీయడం నేర్పుతున్నావా! ఛీఛీ, నీవల్ల నా పరువుపోతోంది. నా ప్రైవేటు పిల్లలుకూడా తక్కువయిపోయ్యారు. ఏది చెయ్యిచాపు” అంటూ ప్రళయకాలరుద్రుడిలా అయిపోయి ఉంగరాల ప్రేళ్ళతో మొట్టికాయలువేస్తూ, బెత్తం తీసుకుని చీరివేశాడు. ఆ దెబ్బతో వీపు చీరి రక్తం కూడా వచ్చింది. దాంతో నిదానంగా, తొక్కివేయబడి ఉన్నవాడిలోని ఆత్మాభిమానం పెల్లుబికింది.

“మావయ్యా! ఆగు, బెత్తం ఎత్తేవంటే నేనేంచేస్తానో నాకే తెలీదు...ఆగు!” అంటూ చొక్కా చేతులు పైకి ఎత్తుతూ భగవంతుడిచ్చిన బలపుష్టి చూపించాడు.

ఆ కండరాలు ఎత్తు తిరుగుతూ చర్మం చీల్చుకుని పైకివస్తాయా అనిపించాయి.

ఆయన వెనక్కు తగ్గాడు. కానికోపంతో పళ్ళు పటపట కొరికాడు.

“వెధవా, ఎందుకు కండలు పెంచుకున్నావురా? బలిసిందా, నిన్ను ఇంటికి ఎవర్ని ఉద్ధరించడానికి? ఇంట్లోంచి వెళ్ళు ...వెళ్ళు...' అంటూ గొడ్డుదెబ్బ కొట్టి పట్టుకు తోశాడు” మిలిటరీ యువకుడు నిశ్చలంగా, స్థైర్యంగా కథ చెబుతూన్నా ఈ చివరి మాటలకు ఉద్వేగపూరితం




కంఠం గద్గదికం కాకపోలేదు.

జానకిరామయ్య ఏదో యోగ సమాధిలో ఉండిపోయినట్లు మూసినకండ్లు తెరవలేదు.

“తరవాత, నాకు కట్టిన బండకొయ్య గొలుసును 'షడేల్'మని ఒక్క దెబ్బకు త్రెంచివేశాను. మామయ్య శాపనార్థాలే నాకు నా కర్తవ్యాన్ని బోధించినట్లయింది. నేషనల్ ఆర్మీలోచేరి, పోనాడు, రక్తనిధికి నా రక్తం దానంచేస్తూ ఉంటే, నాకు ఆర్మీలో చేరిపొయ్యే అవకాశం లభించింది. ఎలా..” అనుకోకుండా, భావావేశాలతో ఉప్పొంగిపోతూ ఆతురాతురంగా చెబుతూన్న తన కథలోకి దిగిపొయ్యాడు మిలటరీయువకుడు.

“మావయ్యా.....” నిరుత్తరుడయి కండ్లుమూసుకున్న జానకిరామయ్యను పలకరించాడు.

ఆయనకండ్లు తెరుస్తూ, “నాయనా బలరాముడూ... హృదయవిదారకమయిన నీకథవింటూ చచ్చిపోయినా బాగుండేది. అయినా చచ్చిపోలేదు. ఈ వయసులో కూడా నాలో కాఠిన్యం పోలేదని నీకు తెలియడంలేదా నాయనా.” అనుభవిస్తున్నానని కుమిలిపోతూ అన్నాడు జానకిరామయ్య.

“మావయ్యా...... గతించిపోయిన దినాలలో విడిపోయిన మనం కాకతాళీయంగా కలుసుకున్నాం. నీవు మొదట్లో మిలటరీవారిపై చూపెట్టిన ఉత్సాహం నీకు కథ చెప్పడానికి ఉద్రేకపరచినది. కాకపోతే, గుప్త స్వప్నం లాంటి పాతసంఘటనలు ప్రస్తావించకపోదును, నన్ను క్షమించు” అన్నాడు బలరామ్.

“బాబూ, నీవినయ సంపత్తితో నన్నింకా వ్యథపెట్టకు. నన్ను మనసారా క్షమించునాయనా..... ఏదీ ఇలా దగ్గరకురా! యూనిఫారమ్‌లో ఎంత మారిపొయ్యావు. నాయనా..... దగ్గరకురా. నా పక్కన కూర్చో”......... అంటూ అర్థించాడు.

బలరామ్‌వెళ్ళి జానకిరామయ్య ప్రక్కనే కూర్చున్నాడు. ఆయన పాతస్మృతులకు కుమిలిపోతూ బలరామ్‌ను కౌగలించుకుని అతని వీపును కావాలని నిమిరి పశ్చాత్తప్తహృదయంతో కుమిలి పొయ్యాడు.

ఇంతలో మళ్ళా స్టేషన్‌లో జనసమ్మర్దం ప్రారంభమయింది. “ఢిల్లీ వెళ్ళే గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్ మరొక రెండు నిముషములలో వస్తున్నది” అంటూ వెయిటింగ్ రూమ్‌లో ప్రకటన వెలువడింది.

